# శెలవు

“ఇంకా చెయ్యలేదురా !”

అప్పటివరకు ఏదో ఆలోచిస్తూ టేబిల్‌పై ‘చాక్‌పీస్’తో పిచ్చి గీతలు గీస్తూన్న లెక్కల మాష్టారు ప్రశాంతతను భంగపరిచాడు.

‘నోట్ బుక్స్’ లోకి వంగిన విద్యార్థుల తలలు పైకి లేవలేదు.

“అర్థం కాలేదా”, అని స్వగతంగా పలుకుతూ కుర్చీ వెనక్కి జరిపి నల్లబల్లకేసి నడిచాడు మాష్టారు.

“అర్థం కాకపోవటానికి ఇందులో ఏముందిరా ?...నిజంగా మాట్లాడితే ఇందాకటి లెక్కకన్న ఇదే సులభం. ఒకసారి నేను బోర్డుమీద వేస్తాను—జాగ్రత్తగా చూడండి.”

ఆ మాటలన్నీ విద్యార్థులను సంబోధిస్తూ పలికినవే అయినప్పటికీ ఆయన మాత్రం నల్లబల్లవైపు తిరిగి మాట్లాడ సాగాడు.

“చూశారా !...ఇందాకటి లానే మొదలు”

“ఇదీ స్టెప్ ఇదీ ఈజ్ ఈక్వల్టు - ఇదీ - అంతవరకూ అయిపోయిందా ?—దీన్ని ప్రక్కన బెట్టండి.” ఆ మొత్తాన్ని ఒక మూలబెట్టి గుండ్రని సున్న చుట్టాడు. “దీనితో మనకు అవసరము లేదు. ఇక ఇక్కడకు రండి—దీంట్లో నుండి దీన్ని తీసెయ్యండి. తీసేసామా ! ఈ వచ్చినదాన్ని దీనికి కలపండి.. పోగా—దీన్ని దీంట్లోనుంచి కొట్టివెయ్యాలి—కొట్టుపోతుందా ?... కొట్లు పోదు. ఎందుకంటే దీనికన్నా ఇది ఎక్కువకాబట్టి”—ఒక పెద్ద ఇంటూమార్కుతో దాన్ని కొట్టిపారేశాడు.

“అందువలన దాన్ని (ఆమూలన జాగ్రత్తగా సున్న చుట్టి దాచింది) తెచ్చి దీనికి కలపండి...కలిపారా ?...అయితే వాడు యింతకు మనల్ని అనుకోమన్నదేమిటి ?”

'నష్ట శాతం సార్'— మాష్టారి అభిమాని ఒక డరిచాడు.

"నష్ట శాతం కదూ?... ఇప్పుడేంచేయ్యాలి...వాడు బండినీ, గుర్రాన్ని కలిపి అమ్మిన దెంత... గుర్రం ఖరీదు మొత్తంలో తీసెయ్యండి."

"సరిపోయింది సార్" ఇద్దరు ముగ్గురు సూక్ష్మబుద్ధులు అరిచారు.

"అందరికీ తెలీసిందా...ఒరేయ్ మోహన్...లే-అర్థమయిందా?"

మోహన్ లేచాడు—గతరాత్రి నిద్రలేని సూచనలు కళ్ళల్లో కనిపిస్తున్నాయి. ఎర్రగా మండుతున్నాయి. తల చెరిగిపోయింది.

ఏమని జవాబు చెప్పాలో తెలియక నిలబడిపొయ్యాడు - అర్థమయిందంటే బోర్డు దగ్గరకొచ్చి చెయ్యమని అడిగితే ప్రమాదముంది. అర్థం కాలేదంటే "ఏముందక్కడ అర్థం కాకపోవటానికి...మొద్దు వెధవ.. అసలు నీ మనస్సు ఇక్కడ ఉంటేగా...ఎక్కడ గాలిపటాల్లో తిరుగుతుందో" అని విరుచుకపడే ప్రమాదం ఉంది, విషమపరిస్థితి ఆసన్నమైంది. వెంటనే సమాధానం చెప్పాలి. లేకపోతే అర్థంకాని క్రింద కొచ్చేస్తుంది.

తల వూపాడు—ఔనన్నట్లో—కాదన్నట్లో తెలియకుండా.

'సిట్ డౌన్' మామూలు ధోరణిలో పలికాడు మాష్టారు.

హమ్మయ్య — రక్తప్రసారం మొదలైంది మళ్ళీ — ప్రమాదం నూలువారలో తప్పిపోయింది. కానీ పూర్తిగా ధైర్యం చిక్కలేదు - మళ్ళీ మాష్టారు అడగని గ్యారంటీ ఏముంది? ముందు బెంచీ పిల్లవాడి చాటుగా తలవంచుకొని ప్రక్కవాడిదాంట్లో చూసి అతి జాగ్రతగా ఒక్కొక్క అంకె తన బుక్‌లో ఎక్కించుకో సాగాడు.

"వేసికొన్నారా!...ఇంకొక లెక్క."

అబ్బ—పాడు పీరియడ్— అయిపోదేమిటి?. ...వాడు గంట కొట్టటం మరచిపొయ్యాడా ఏం?...లేక ఏదైనా నోటీసు పట్టుకొని క్లాసుల వెంట తిరుగుతున్నాడేమో.. లెక్కల పీరియడప్పుడే వాడికి పని చెబు

తాడు హెడ్మాష్టరు...బట్టతల, ఆయనా..!...వూరక కూర్చోక 'టింగ్—టింగ్' మని కాలింగ్‌బెల్ నొక్కుతాడు నిమిషాని కొక్కసారి...

గంట గణగణ మ్రోగింది—హోంబెల్,

పీడ విరగడయినట్లు 'నోట్‌బుక్' సంచిలోకి విసిరేశాడు, లేవటానికి ఉద్యుక్తుడౌతూ.

"ఆల్ ఆఫ్ యూ సిట్‌డౌన్" మాష్టారు డస్టర్ బల్లకేసి కొట్టాడు.

"టేక్ హోంవర్క్ ... రేపు ఆదివారం కదూ...ఊఁ!...ఏదిరా నీ గణితం ఇటుతే...ఈ పన్నెండవ అధ్యాయంలో ఉన్న యిరవై అయిదు లెక్కలు రేపు సోమవారం చేసుకురావాలి...కాపీ కొట్టినట్లు కనబడిందా నడుంలు విరిగాయె...ఇదిగో" బెత్తం చూపెట్టాడు

"ఒరేయ్—మోహన్...సోమవారం చెబుతా నీపని...ఈవేళలా కాపీకొట్టావో...నీ డొక్క చీరేస్తా" అంటూ వెళ్ళిపోయాడు మాష్టారు. ఆయన హెడ్మాష్టరి గదిలోకి వెళ్ళేవరకూ పిల్లిలా అడుగులో అడుగు వేసికొంటూ నడిచి ఆపైన ఒక్కపరుగు లంకించుకొన్నాడు మోహన్.

మధ్యాహ్న భోజనం ముగించుకొని నిక్కరుకు చెయ్యి తుడుచుకుంటూ వీధిలో కొచ్చాడు.

రెండు గంటలవేళ. సూర్యుడు నిప్పులు చెరిగిపోస్తున్నాడు. తెల్లగా దుమ్ము రేగుతున్న బజార్లు నిర్మానుష్యంగా ఉన్నాయి. మోహన్, పండు వెన్నెలలో నడిచినట్లు హాయిగా నడుస్తూ ఆవీధి మొదట్లో ఉన్న చింత చెట్టు సమీపించాడు. దాని చల్లని నీడలో ఒక గానుగ—ఆ గానుగరాతిని దొర్లించటానికి ప్రయత్నిస్తున్నారు నల్గురు పిల్లలు—మరొకడు వాళ్ళ శ్రమను నవ్వుతూ పరిశీలిస్తున్నాడు.

"ఒరేయ్...ఇది మనం దొర్లించలేమట—వాడంటున్నాడు...పట్టు—ఆ!...అందరం ఒక్కసారే"...ఒకడు ఒగరుస్తూ చెప్పాడు—

మోహన్ రాతిపై చెయ్యివేసి తన బలాన్నంతా ప్రదర్శించాడు. రాయి ఒక అడుగు ముందుకు కదిలి ఆగిపోయింది.

ముందుకు వంగిన శరీరాలు, నిటారుగా లేచి నిలబడ్డాయి.

"మధ్య మధ్యలో ఆపకూడదు—ఏక్‌దమ్ పోవాలి....వూఁ పట్టో" మోహన్ అరిచాడు. మరొక అడుగు కదిలింది.

"ఒరేయ్—రాతిమీద మనకు పట్టు చిక్కటంలేదు. ఇటు రండి... ఈ దూలాన్ని పట్టుకొందాం...ఇలా"...ఆ నల్గురినీ రెండు జట్లుగా విడదీసి ఎదురెదురుగా నిలబెట్టి తను ఇనుపకొక్కెం పట్టుకొన్నాడు మోహన్. ఈసారి ఒక గజం కదిలింది;

చెమట్లు పట్టిపొయ్యాయి శరీరాలు—రక్తం ముఖంలోకి ఎగతట్టింది. తిన్న తిండి సర్దుకొంది...నోళ్ళు తెరచి గట్టిగా శ్వాస తీసుకొని మళ్ళీ పట్టుబట్టారు,

"ఒరేయ్ మీ కిదేం పొయ్యే పోకడ్రా...కాళ్ళూ చేతులూ ఇరిగిందాక నిద్రబొయ్యేటట్టు లేరేరా !...ఎవరి పిల్లర్రా మీరు"...వయస్సు మళ్ళిన గొంతు, ఎదిరింటి పంచపాళీనుండి పెద్దగా అరచింది.

అక్కడనుండి 'హే' అని అరుస్తూ వెళ్ళిపొయ్యారు. సరాసరి వూరిబయట పెద్ద చెరువు కెళ్ళారు. బట్ట లూడదీసి చుట్టి తూము ప్రక్కన బెట్టి వాటిపై బండ పెట్టారు. వెనక్కి నడిచి పరుగెత్తుకొంటూ వచ్చి తూముపైనుండి 'పల్టీ' కొట్టి ఒక్కొక్కడే నీళ్ళలో పడ్డారు. గడ్డపార ఈత, పీనుగ ఈత, అనేకవిధాల ఈతలలో ప్రావీణ్యం ప్రదర్శించారు. మునిగి ఎవరు ఎక్కువసేపు దమ్ము పట్టగలరో, ఒంట్లు లెక్కించి తేల్చుకొన్నారు.

పొద్దు వాటారింది—ఒకళ్ళిద్దరు కావిళ్ళు వేసుకొని చెరువుకు నీళ్ళకొచ్చారు;

"ఒరేయ్...ఇక పోదాం పదండ్రా...ఎవరైనా చూచి ఇంట్లో

చెప్పారంటే చచ్చామన్నమాటే"...మోహన్ అంటూనే ఒడ్డు చేరుకొని తడిమీదనే బట్టలు తగిలించాడు.

"నా కళ్ళు బాగా ఎఱ్ఱగా ఉన్నాయా" అనుచరులను ప్రశ్నించాడు.

"ఆ!...మరి నావి"...

"నీవి కూడ...అయితే చీకటి పడేవరకూ ఇంటికి పోకూడదురా!... ఎవడిదగ్గరైనా దువ్వెన ఉందిరా?" అందరూ ముఖాలు చూచుకొన్నారు... ఎవరూ మాటాడలేదు. చేతితో తడుముకొని వెంట్రుకలను పాపిటిలా చేసుకోటానికి ప్రయత్నంచేస్తూ చెరువుకట్టపైన నడవసాగారు. గాలికీ, ఎండకూ తలలు ఆరిపోయి ఎఱ్ఱగా జొన్నచొప్పలా గాలికి వూగులాడ సాగింది జుట్టు.

"ఒరేయ్...మీరు ముగ్గురూ మా యింటికి రండిరా...లెక్కలు చేసిపారేద్దాం...రేపు హాయిగా తిరగొచ్చు" మోహన్ అన్నాడు.

"బాప్రా...నేను మరిచేపొయ్యా...సాయంత్రం చేసేద్దాం" ఒక డన్నాడు.

"సాయంత్రం కాదులేరా!...రేపు మధ్యాహ్నం చేసుకుందాం... ఈవేళ ఈత కొట్టాంకదా?...అన్నం తినగానే నిద్ర ముంచుకొస్తుంది" ఇంకొకడు అభ్యంతరం తెలిపాడు.

"రేపు మధ్యాహ్నమే అన్నీ చెయ్యగలంరా...ఆయన సొమ్మంతా పోయినట్టు పాతిక లెక్క లిచ్చాడు—ఇప్పుడు పది చేసుకొంటే రేపు... మోహన్ అన్నాడు. చీకటిపడేవరకూ ఆ లెక్కల మేష్టార్నిగూర్చి మాట్లాడుకొంటూ అటనట తిరిగి ఇండ్లకు చేరుకొన్నారు.

రాత్రి భోంచేసి దీపంవద్ద చేరాడు మోహన్. ఒకలెక్క చదివి నోట్ బుక్ 'మార్జిన్'లో ఒకటి వేశాడు. అ తరువాత ఐదు నిమిషాలు 'పెన్సిల్' ముక్క చెక్కాడు. మళ్ళీ మొదలెట్టాడు. తల వూగి వూగి దీపంమీద పడసాగింది. లేచివెళ్ళి చన్నీళ్ళతో కడుక్కొని కనురెప్పలు

బలవంతాన తెరచుకొని పుస్తకంలోకి తొంగిచూశాడు. లాభం లేకపోయింది. నిద్ర ముంచుకొచ్చి చాపపై అలానే కాళ్ళు ఆరజాపుకొన్నాడు.

“ఈడి చదువూ...చట్టుబండలూ...ఎనిమిదన్నా కాలేదు. అప్పుడే పండుకొన్నాడు...ఒరేయ్...లే...లేచి ఆ మంచంపై తగలబడు” వాళ్ళ నాయనమ్మ తిట్టి లేపింది.

తెల్లవారేప్పటికి అదివారాన్ని మోసుకొచ్చాడు సూర్యుడు, ఎంత చక్కగా నెమ్మదిగా నవ్వుతూ పైకెక్కుతున్నాడు సూర్యుడు, చల్లగాలి కిటికీలోనుండి ‘రూమ్’లో కొస్తోంది. ‘జో’ కొట్టినట్లు హాయిగా ఉంది. పెరట్లో బాదంచెట్టు ఆకులు పచ్చగా నిగనిగలాడుతున్నాయి. పందిరిపై కోళ్ళు తీరిగ్గా కూర్చున్నాయి. దేన్ని చూసినా ఉదయభానుని కాంతిలో అందాలు చిందిస్తున్నాయి. ఆదివారం సూర్యుడు ఎంత బాగున్నాడు—ముసుగు తొలగించుకొని కిటికీలోగుండా చూడసాగాడు మోహన్.

ఆదివారం కాకుండా మిగతా దినాల్లో సూర్యుడు—భగున మండిపోతాడు—తారాజువ్వలా పై కెళ్ళిపోతాడు—‘ఒరేయ్—లే—స్నానం చెయ్యి—నీళ్ళారిపోతున్నాయి—త్వరగా కానివ్వరా—నీ కింత తిండిపెట్టి మా పనులు చూసుకుంటాం. ఇంకా పళ్ళు తోమలా? పొద్దు చూడు ఎంతెక్కిందో...అయ్యో రామా...ఏం పిల్లాడివిరా . . . తోటి పిల్లలు చూడు చక్కగా తలలు దువ్వుకొని ఎంత ముచ్చటగా పోతున్నారో . . . అసలు బడికి పోవాలనుంటేగా నీకు,”

ఇదీ వరస—అ వెధవ సోమవారంతో మొదలు. శనివారందాకా ఒకటే సాధింపులు— కానీ ఆదివారం రోజు ఈలాటివి ఉండవు—ఎంత చక్కని ఆదివారం—ఇల్లంతా కలయజూశాడు—అంతా ఆదివారం—ఆదివారంగా ఉంది. ఈలాటి ఆదివారాలు వారానికి రెండయినా కనీసం ఉండకూడదా అనిపించింది.

బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని అటు ప్రక్కకు తిరిగాడు మోహన్. ఎదురుగా పుస్తకాల అలమరా . . . వరసగ్గా ఉన్న పెద్దపెద్ద బొండు

పుస్తకాలు ఇంగ్లీషువి, వాటిపైన కుక్క చెవుల్లా వేలాడుతున్న మడత బడ్డ పేజీలతో ఆ వెధవ లెక్కల నోట్ బుక్—రాత్రి నాయనమ్మ పెట్టి ఉండవచ్చు. అపశకునం. కళ్ళు గట్టిగా మూసుకున్నాడు.

పాతిక లెక్కలు.

సీసాలో పేరుకొన్న నూనె ఎండ పొడ తగలగానే కరిగినట్లు అది వారం సంతోషం కాస్తా క్షణంలో కరిగిపోయింది. లేచి వెళ్ళి ఆదరా బాదరా ముఖం కడుక్కొని చాప పరచుకొన్నాడు. విసురుగ్గా అలమరా దగ్గరకెళ్ళి ఆ లెక్కలపుస్తకం క్రిందికి లాగాడు. చీకాకు పడసాగాడు. ప్రశాంతంగా లేదు— ప్రక్కగదిలో రేడియో అస్తమానం హోటల్ లోలా వాగుతూంటుంది—వినేవాడున్నా లేకపోయినా !...వెళ్ళి స్విచ్ ఆఫ్ చేశాడు.

"ఎవర్రా అదీ...మోహన్"...వంటగదిలో నిలబడి కాఫీ తాగుతున్న తండ్రి కంఠం పిలిచింది. మళ్ళీ ముందుకు తిప్పాడు.

"వెధవా ! సిలోన్ పాటలు వింటానికా...పెద్ద హిందీ పాటలు తెలిసివచ్చినట్లు"...ఆయన ఇంకా వాగుతూనే ఉన్నాడు.

ఆ మాట్లాడుతున్న కంఠం స్థాయిని అధిగమించేలా 'వాల్యూమ్' పెద్దది చేశాడు.

"ఆకాశవాణి ... వార్తలు మీరు వింటున్నారు. గత రెండు రోజులుగా అస్వస్థతగా ఉంటున్న—మంత్రిగారి పరిస్థితి మరింత క్షీణించిందని డాక్టర్లు. చెప్పారు—స్పృహ ఇంకా రాలేదు—అందరూ ఆయన్ను చూడటానికి వెళ్ళారు ... భారీ వర్షాలమూలంగా గత సంవత్సరం ..."

ఆ వార్తలు వినటం అనవసర మనిపించింది—ముఖంపైన ఇందాకటి నైరాశ్యభావాలు తొలగిపొయ్యాయి. విస్మాత్మకాంతులతో ముఖం ప్రకాశించింది. లెక్కలపుస్తకం తిరిగి అలమారాలోకి గిరాటు వేశాడు. చాపచుట్టి తలుపుచాటున బెట్టాడు.

"మోహన్ !" బయటినుండి కేక వినిపించింది.

"ఒరేయ్—సర్కస్ వచ్చిందిరా మన వూరికి—రా పోదాం—ఇప్పటికి ఒక ఏనుగ రెండు గుర్రాలు—ఇంకా ఒక ఒంటె వచ్చాయి. ఇంకా పెద్దపులులు, చిరతగండ్లు వెనుక బండ్లమీద వస్తున్నాయట ... రా పోదాం" ... గసబోసుకొంటూ వచ్చిన స్నేహితుడు, చెప్తూనే వీధివాకిలి వైపు లాక్కెళ్ళాడు.

"ఇప్పుడు ఆ ఏనుగెక్కడుంది ?... పద" అంటూ చేతులు చేతులూ పట్టుకొని, ఆ సర్కసువాడు సామాన్లు దింపుకుంటున్న స్థలానికి పరుగెత్తారు. ముందొక జనరల్ విజిట్ తీసుకొన్నారు—ఆ తరువాత ఏనుగ దగ్గర కొచ్చారు. ఒక పెద్ద గొలుసుతో ఏనుగను కట్టివేశారు—మర్రి కొమ్మలు విరుచుకు తింటోంది అది. పిల్లలందరూ, దూరంగా కూర్చున్నారు దాని చుట్టూ. పెద్దగా కేకలేస్తున్నారు. మోహన్ జట్టును వెంట బెట్టుకొనీ. దాని ఒక్కొక్క అంగాన్నే పరిశీస్తూ దాని చుట్టూ ప్రదిక్షిణాలు చేయసాగాడు. ఏనుగును గూర్చి ఎవరికి తెలిసినంత వాళ్ళు విపులంగా వర్ణించారు. ఏనుగు చూడకుండా వెనకాలగా వెళ్ళి దాని వెనకకాలు అంటీ అంటనట్లుగా స్పృశించి పరుగెత్తాడు మోహన్.

"ఎలా ఉందిరా"—కుతూహలంగా అడిగారు.

"గట్టిగా సిమ్మెంటుదిమ్మెలా ఉంది" కళ్ళు ఇంతింత చేసుకొని ఒత్తి పలుకుతూ అన్నాడు. గుర్రాలవైపు దారితీస్తూ, గుర్రాలవద్ద ఐదు నిముషాలకన్న ఎక్కువసేపు నిలబడలేదు. ఒంటెవద్ద కెళ్ళారు. పొడవైన దాని మెడచూసి విస్తుపొయ్యారు. "గూనివాడిలా ఉందిరా పాపం"-జాలిపడ్డారు.

పన్నెండు గంటలవేళ అందరికీ ఆకలౌతున్నట్లనిపించింది. కాళ్ళీడ్చుకొంటూ ఇంటిముఖం పట్టారు.

"ఒరేయ్ ... అన్నంతిని వెంటనే వచ్చెయ్యాలి. ఏనుగను వాడు చెరువుకు తోలుకెళ్ళాడ ... ఎన్ని నీళ్ళు తాగుతుందో—ఎలా ఈత కొట్టుతుందో—చూడాలి." మోహన్ పురమాయించాడు.

భోజనాలుచేసి తిరిగి అక్కడికి వెళ్ళేసరికి—పెద్దపులులు—చిరుత

గండ్లు వచ్చి ఉన్నాయి. విసుగు విరామంలేని పని దొరికింది—పెద్దపులి గాండ్రు గాండ్రుమని అరిచింది. అందరూ ఒక ఫర్లాంగు దూరం పరుగెత్తి మళ్ళీ వచ్చారు. అవి బోనుల్లో ఉన్నప్పటికీ దగ్గర కెళ్ళాలంటే ధైర్యం చాలటంలేదు. పైగా కాపలావా డొకడు 'పొండి—పొండ'ని వెంటబడి తరుముతున్నాడు.

ఆ పగలు ఎండంతా వాళ్ళ మీదుగా పోయింది—చీకట్లు ముసురుకోసాగాయి. ఇళ్ళకేసి దారితీశాడు మోహన్ పరాగ్గా ఆలోచిస్తూ,

వారంరోజులుగా ఎదురుచూసిన ఆదివారం వచ్చినట్టు వచ్చి ఇట్టే మాయమైంది - తెల్లవారితే పాడు సోమవారం. మళ్ళీ ఆరు రోజులకు గానీ ఆది వారం రాదు - తెల్లవారితే బడి; పాతిక లెక్కలు చూపెట్టాలి -

మోహన్ కాళ్ళు నీరసించిపోయాయి. స్నేహితులు ఇంకా జంతువులను గూర్చి నవ్వుకొంటున్నారు,

"అరేయ్ - లెక్కలు చేశార్రా" మెల్లగా అడిగాడు.

సడన్ బ్రేక్ పడిన వాహనంలా జట్టంతా, ఒక్కసారే ఆ దుమ్ములో ఆగిపోయింది. సమాధానం కోసం ఆ చీకట్లో ఒకరి ముఖాలొకరు చూసుకొన్నారు.

"నువ్వు ..... చేశావా" అనుమానంగా ఎదురు ప్రశ్న వేశాడొకడు.

"ఊహుఁ ... మీరు" -

"మేమూ చెయ్యలే" అందరూ ఏక కంఠంతో సమాధాన మిచ్చారు, ఎవడో ఒకడు లెక్కలుచేసి జట్టు ఐక్యతను భంగపరచనందుకు మోహన్ గర్వించాడు.

ఎవడూ చెయ్యకపోవడం అవ్యక్తమయిన సంతోషం కలిగించింది.
"పోదాం - పదండి;"

"ఒరేయ్ ..! ఆగండ్రా" మరుక్షణంలోనే హుకుం జారీచేశాడు

ఎదురుగా ఉన్న ఆంజనేయస్వామి మంటపంవైపు చూస్తూ. మంటపంలో వేలాడగట్టిన పంచాయతీబోర్డు వాళ్ళ 'లౌడ్‌స్పీకర్' –

"మంత్రిగారి ఆరోగ్యం ఈ సాయంత్రానికి మరింత క్షీణించింది. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు – ఆత్మీయులూ ఆయన్ను చూడటానికై 'రాజధాని' చేరుకొంటున్నారు.

"ఒరేయ్ .,. రేపు పోతే .,. మంగళవారం లెక్కల పీరియడ్ లేదు. బుధవారంనాటికి మనం లెక్కలు చూపెట్టాలి ... ఎల్లుండి మా యింటికి రండి ... అందరమూ కలిసి చేద్దాం" మోహన్ అన్నాడు.

"మరి ... రేపు" అమాయకంగా అడిగా డొకడు.

"రేపు బడికి శెలవురా ! ... చల్" .,. పెల్లుబికిన ఆనందంతో పెల్లుబికిన ఆనందంతో స్నేహితులను విస్మరించి ఇంట్లోకి పరుగెత్తాడు జట్టు నాయకుడు, సుష్టుగా భోంచేసి మంచమెక్కాడు. తెల్లవారింది,. వాళ్ళ నాయనమ్మ తిట్టగా, తిట్టగా ఆరున్నరకు పక్కదిగాడు. సూర్యుడు పరిసరాలూ అన్నీ ఆదివారంలోనే ఆహ్లాదకరంగా కనిపించాయి. సన్నగా ఈలవేసికొంటూ బావి దగ్గర కెళ్ళాడు; స్నానం ముగించుకొని మధ్య గదిలో కొచ్చేటప్పటికీ వార్తలు వస్తున్నాయి.

"మంత్రిగారి ఆరోగ్యం ఈ ఉదయానికి కొద్దిగా మెరుగైందని డాక్టర్లు తెలియపరిచారు. గతరాత్రి పన్నెండు గంటలకు వారికి స్పృహ వచ్చింది."

మోహన్‌కు స్పృహ తప్పిపోయింది, గుండె ఆగిపొబోయింది. అలానే కుర్చీలో వాలిపొయ్యాడు, స్కూలు గంట గణగణ వినిపించింది.

పాడు ఉదయంపూట బళ్ళు ... కాఫీకొట్టటానికి కూడ 'టైం' దొరకదు. తిట్టుకొంటూ అలమరా వద్దకు శరీరాన్ని ఈడ్చుకెళ్ళాడు. లెక్కల 'నోట్ బుక్' ముట్టుకొంటే వేళ్ళు వణికాయి. గబుక్కున దాన్ని సంచిలో తోసేశాడు. స్కూలువైపు నడిచారు.

'వెధవది – ఫస్టు పీరియడే లెక్కలు – హోం వర్క్ చూసిగాని

లెక్కలు మొదలుబెట్టడు సార్. ఈవాళ మరచిపోతె బావుణ్ను ... దేవుడి దయవలన ఆయనకు జ్వరమొస్తే శెలవు బెడతాడు . ఆయన కెప్పుడూ జ్వరం రాదు" - తలపోస్తూ వెనక బెంచీ పైకి దేహాన్ని చేర వేశాడు.

మూడోగంట కొట్టారో లేదో లెక్కల మాష్టారు ప్రత్యక్షమయ్యారు డస్టర్లు, బెత్తంతో సహా. హాజరు తీసికొని రిజిష్టర్ ప్రక్కన బెడుతూనే అడిగారు - "హోంవర్క్ చేశార్రా ?"

"కుమార్ ?" మాష్టారు పిలిచాడు.

అతను లేచి నిలబడి తల వంచుకొన్నాడు - 'నోట్ బుక్' చేత బట్టుకొని,

"నెక్ట్స్. - నెక్ట్స్ - క్ట్స్ - నెక్ట్స్" - ఒక వరసంతా వెనకవాళ్ళ కనిపించికుండా నిలబడ్డారు.

"ఒక్కొక్కడే ఇటురండి ... ఎందుకు చెయ్యలేదురా ... చెప్పు ... ఈవాళ చూస్తానని చెప్పానా" గాలిలో వూగిన బెత్తం కుమార్ వీపును నాల్గయిదుసార్లు తాకింది.

చెప్తాసార్ ... చెప్తా" వీపు రుద్దుకొంటూ ఏడుస్తూ అన్నాడు. "ఇవాళ బడికి శెలవని చెప్పాడు సార్ ... మోహన్" ...

"మోహన్ రా దేనికిరా శెలవు ... చెప్పు ... చెయ్యి చాపుముందు. పట్టు"

"చెబుతా సార్ ... చెబుతా ... ఆ మంత్రిగారు చచ్చిపోతాడనుకొని ఈవేళ ... ఈవేళ శెలవని చెప్పాను సార్ ... ఇంకెప్పుడూ చెప్పను సార్" ఏడుస్తూ అన్నాడు.

కోపంతో వూగిన బెత్తం ఆగిపోయింది. సుద్దముక్కతో గీతలు గీస్తూ నవ్వకోటానికి ప్రయత్నించాడు మాష్టారు.